# గులాబీ దూకుడు

- ఉమ్మడి పాలమూరు జిల్లాలో 'కారు' జోరు
- ఎన్నికల ప్రచార సభలతో దూసుకెళ్తున్న బీఆర్‌ఎస్
- ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థుల విస్తృత పర్యటన
- మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న నాయకులు
- ప్రగతికే పట్టం కడుతామంటూ ఎక్కడికక్కడ ప్రజల తీర్మానాలు
- 26న అచ్చంపేట, వనపర్తిలో సీఎం కేసీఆర్ బహిరంగసభలు
- కాంగ్రెస్ పార్టీలో వీడని అనిశ్చితి
- టికెట్లు కేటాయించక పోవడంతో బీజేపీ నేతల డైలమా




మహబూబ్‌నగర్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గులాబీదళం దూసుకుపోతున్నది. ఎన్నికలకు ఇంకా 35రోజుల సమయమే ఉండడంతో పక్కా ప్లాన్‌తో సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం చేపడుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే అన్ని పార్టీల కంటే ముందుగానే గులాబీదళం దూకుడు పెంచింది. మరోసారి పార్టీ అధినేత కేసీఆర్ మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో పర్యటించబోతున్నారు. ఈనెల 18న జడ్చర్ల సభలో ఎన్నికల శంఖారావం పూజించిన గులాబీబాస్ మరోసారి అచ్చంపేట, వనపర్తి బహిరంగ సభలో పాల్గొంటుండడంతో కాంగ్రెస్, బీజేపీలో దడ పుడుతున్నది. కాంగ్రెస్‌లో టికెట్లు ప్రకటించినా ఇంకా అసమ్మతి చల్లారడం లేదు. బీజేపీలో టికెట్లపై ఆశ పెట్టుకున్న ఆశావాహులను నిరాశ పరుస్తూ కేవలం ఇద్దరికే టికెట్లు ఖరారు చేసింది. ఆ పార్టీల తీరుపై సీనియర్ నేతలు మండిపడుతున్నారు. ఈలోగా బీఆర్‌ఎస్ ప్రచారంలో దూసుకుపోతుండడంతో విపక్షాల అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ రెండో విడుత ప్రచారానికి కూడా శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే టికెట్లు ఖరారు చేసి బీఫారంలు కూడా ఇవ్వడంతో అభ్యర్థులంతా ఎన్నికల ప్రచారంలో మునిగిపోయారు. ఇప్పటికే ఒక విడుత మండలాల వారీగా ప్రచారాన్ని కంప్లీట్ చేశారు. పట్టణాల్లో, గ్రామాల్లో కార్యకర్తలు కారు గుర్తుకే ఓటేయాలని ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తున్నారు. పక్కా ప్లాన్‌తో ప్రచారం సాగుతుండడంతో ఉమ్మడి జిల్లాలో గులాబీ జెండా ఎగురడం ఖాయమనే ధీమాతో ఉన్నారు. మరోవైపు పార్టీ ప్రకటించిన మ్యానిఫెస్టో అనేక వర్గాలకు ప్రయోజనం చేకూరేలా ఉందని చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తే చేసే పనులను వివరిస్తుండడంతో ప్రజల నుంచి ఆదరణ పెరుగుతున్నది.

### 12 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్‌ఎస్ క్లీన్ స్వీప్ లక్ష్యంగా పావులు కదుపుతోంది. 2018 ఎన్నికల సీన్ మళ్లీ రిపీట్ చేయాలని భావిస్తోంది. గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 14 స్థానాల్లో ఏకంగా 13 స్థానాలను గెలుచుకొని పాలమూరు జిల్లాలో తిరుగులేని శక్తిగా ఎదిగింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలు కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ఏకైక ఎమ్మెల్యే కూడా బీఆర్‌ఎస్ వైపు రావడంతో 14 స్థానాలు కారు ఖాతాలో పడ్డాయి. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తన హవా కొనసాగించింది. 68 ఎంపీపీ స్థానాలను గెలుచుకొని 90శాతం సర్పంచులను గెలిపించుకొని పాలమూరును కంచుకోటగా మార్చుకున్నది. ఈ ఎన్నికల్లో కూడా అదే సీన్ రిపీట్ చేయాలని పార్టీ నేతలు భావిస్తున్నారు. సిట్టింగ్‌లకే టికెట్లు కేటాయించి ఎక్కడా అసమ్మతి చెలరేగకుండా జాగ్రత్త పడ్డారు గులాబీ బాస్. కొంతమంది నేతలకు పార్టీ పదవులు, కార్పొరేషన్ పదవులు ఇచ్చి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆదేశించారు.

### రెండో విడుత ఎన్నికల ప్రచారానికి రెడీ..

ఉమ్మడి మహబూబ్‌గర్ జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టిన బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ రెండో విడుత ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే ఈనెల 18న జడ్చర్లలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎన్నికల శంఖారావాన్ని జడ్చర్ల నుంచి పూరించి నాయకులు, కార్యకర్తల్లో జోష్ నింపారు. రెండో విడుత ప్రచారంలో భాగంగా ఈనెల 26న అచ్చంపేట, వనపర్తి బహిరంగ సభల్లో ఆయా అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేపట్టనున్నారు. ఈ మేరకు మంత్రి నిరంజన్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజులు సీఎం కేసీఆర్ పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ వచ్చాక వనపర్తి జిల్లా రూపురేఖలు మారిపోయాయి. అదే కోవలో అచ్చంపేటలో కూడా అభివృద్ధిని కండ్ల ముందు ఆవిష్కరించి నల్లమల్ల జనం గుండెల్లో కేసీఆర్ నిలిచిపోయారు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో గులాబీ శ్రేణులు మరింత దూకుడుతో ముందుకు సాగుతున్నారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం వ్యూహరచనలు చేస్తున్నారు. పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. రెండుసార్లు అధికారమివ్వగా, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారని, ప్రజలు అడగకుండానే ఎన్నో పథకాలను అందించారని గుర్తు చేస్తున్నారు. మళ్లీ అధికారం సన్న బియ్యం, రూ.400లకే సిలిండర్, రూ.5వేల ఆసరా పింఛన్, తెల్లరేషన్ కార్డుదారులకు బీమా తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. రైతుబంధు ఎకరాకు రూ.16వేలు ఇస్తున్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ఎన్నో హామీలు ఇచ్చి ఆరు నెలలుగా అధికారంలో ఉన్నా ఒక్క హామీని కూడా నెరవేర్చలేకపోతున్నదని, ఇదే పరిస్థితి తెలంగాణలో రాబోతుందని హెచ్చరిస్తున్నారు.

### సీఎం పర్యటనతో కాంగ్రెస్, బీజేపీలో కలవరం..

ఉమ్మడి మహబూబ్‌గర్ జిల్లాలో మళ్లీ పట్టు సాధించాలని బీఆర్‌ఎస్ పార్టీ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్లు కేటాయించడం, ప్రచారానికి సంసిద్ధం కావడంతో కాంగ్రెస్, బీజేపీలో ఆందోళన నెలకొంది. ఎన్నికలకు ఇంకా నెల రోజుల సమయమే ఉండగా, ఆ రెండు పార్టీలో ఇప్పటికీ అభ్యర్థులే ఖరారు కాలేదు. సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో ప్రచార శంఖారావాన్ని పూరించి రెండోసారి ప్రచారానికి అచ్చంపేట, వనపర్తికి వస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇంకా ఇతర పార్టీల నుంచి అభ్యర్థులు వస్తారని ఆశతో ఉంది. టికెట్లు ఖరారైన వారికి బీఫాం ఇస్తారో లేదోనన్న టెన్షన్ మొదలైంది. బీజేపీలో ఇంకా టికెట్ల వ్యవహారం కొలిక్కిరాలేదు. బీఆర్‌ఎస్ ప్రచారంలో దూసుకుపోతుండడంతో తమకు డిపాజిట్ అయినా దక్కుతుందా లేదోనని ఇతర పార్టీ అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారు.

# సరికొత్త సొబగులు

- అభివృద్ధిలో వనపర్తి ముందడుగు
- సాగునీటి కల్పనలో నెంబర్‌వన్
- 14 మండలాలకు ప్రాజెక్టు నీళ్లు
- మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు
- రోడ్ల విస్తరణతో మారిన రూపురేఖలు
- రేపు వనపర్తిలో సీఎం కేసీఆర్ బహిరంగ సభ

వనపర్తి అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : బీడుగా మారిన పొలాలకు సాగునీటిని తీసుకొచ్చి నీళ్ల నిరంజనుడిగా పేరొందారు మంత్రి నిరంజన్‌రెడ్డి. ఉమ్మడి రాష్ట్రం లో నిత్యం కరవు కాటకాలతో అల్లాడిన ప్రజలు నేడు సంబురంగా సాగు చేసుకుంటున్నారు. తొమ్మిదేండ్లలోనే మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సాగునీటి వసతులను కల్పించడంలో పట్టువదలని విక్రమార్కుడిలా పని చేస్తున్నారు. సాగునీటితో పాటు విద్యా,వైద్యం,అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టి వనపర్తి రూపురేఖలు మారిపోయాయి. నిత్యం ట్రాఫిక్‌తో తంటాలు పడే ప్రజలకు విశాలవంతమైన రోడ్లు నిర్మించి ప్రయాణికుల కష్టాలు తీర్చారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సీఎం కేసీఆర్ గురువారం వనపర్తి పాలిటెక్నిక్ మైదానంలో జరగనున్న బహిరంగ సభకు వస్తున్నారు. దీంతో గులాబీ పార్టీలో మరింత జోష్ పెరిగింది.

### అభివృద్ధిలో పరుగులు..

ఇప్పటికే విద్యాభివృద్ధిలో కీలకంగా నిలిచిన వనపర్తి కొత్త రాష్ట్రంలో అభివృద్ధిలో మరింత ముందుకు దూసుకుపోతున్నది. వనపర్తి, గోపాల్‌పేట, ఖిల్లా ఘణపురం, పెద్దమందడి, పెబ్బేరు, శ్రీరంగాపురం, రేవల్లి, వీపనగండ్ల, పాన్‌గల్, చిన్నంబాయి, కొత్తకోట, మదనాపురం, ఆత్మకూరు, అమరచింత మండలాలు వనపర్తి జిల్లా పరిధిలో కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఎంజీకేఎల్‌ఐతోపాటు బీమా ప్రాజెక్టుల ద్వారా కొత్తగా సాగునీరందించేలా చర్యలు చేపట్టారు. దీంతో నేడు జిల్లాలో ఎక్కడ చూసినా పచ్చనిపంటలు కనిపిస్తున్నాయి. గతంలో జూరాల ప్రాజెక్టు ద్వారా మాత్రమే జిల్లాలోని కొంత భాగానికి సాగునీరందించే వెసలుబాటున్నది. ఇప్పుడా పరిస్థితుల నుంచి జిల్లా పూర్తిగా గట్టెక్కింది. ప్రస్తుత వానాకాల సీజన్‌లో దాదాపు లక్షా 86వేల ఎకరాల్లో ఒక్క వరి సాగే చేశారు.

### 14 మండలాలకు సాగునీరు..

జిల్లా పరిధిలో ఉన్న 14 మండలాలకు వివిధ ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందుతున్నది. వీటిలో ఒక్కో మండలానికి రెండు ప్రాజెక్టుల నీటి వసతులు కూడా ఏర్పాటయ్యాయి. గతంలో ఒక్క పెబ్బేరు మండలంలో కొంత భాగం జూరాల కాల్వ ద్వారా నీటి వసతి తప్పితే మిగితా ప్రాంతమంతా భూములు బీడుబారి ఉండేవి. ఐదేండ్లలోనే ఎంజీకేఎల్‌ఐ ద్వారా మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పుష్కలంగా సాగునీరు అందించేలా చర్యలు చేపట్టారు. మరికొన్ని మండలాలకు బీమా ప్రాజెక్టు ద్వారా నీరొచ్చేలా చేశారు. అలాగే జిల్లా పరిధిలో ఉన్న కొల్లాపూర్ నియోజకవర్గంలోని మూడు మండలాలకు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ద్వారా నీటి వసతి చేకూరింది. కొత్తకోట, మదనాపురానికి బీమా, ఎంజీకేఎల్‌ఐ సాగునీటిని అందించడంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సఫలీకృతమయ్యారు. మక్తల్ పరిధిలోని రెండు మండలాలకు జూరాల ప్రాజెక్టు నుంచి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సాగునీరందించడంలో కృషి చేశారు.

### మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలలు..

తొమ్మిదేండ్లలో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి. వనపర్తిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయించుకోవడంలో మంత్రి సింగిరెడ్డి పాత్ర ఎంతో ఉన్నది. నూతన కార్యాలయాలను నిర్మించడంలో మంత్రి కీలకంగా వ్యవహరించారు. అలాగే మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలలను ఏర్పాటు చేసి తక్కువ సమయంలో అభివృద్ధి చేశారు. ఈ ప్రాంతానికి అవసరమైన పనులన్నీ కూడా సీఎం కేసీఆర్ మంజూరు ఇవ్వడంతో తిరుగులేకుండా పోయింది. బీఎస్సీ నర్సింగ్ కళాశాల, అగ్రికల్చర్ బీఎస్సీ, మత్స్య కళాశాల ఇలా ఉన్నత విద్య కోసం ఎక్కడెక్కడికో వెళ్లకుండా చేయడమే కాకుండా పేదలకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారు. దశాబ్దాల తరబడి పట్టణవాసులు ఎదురుచూసిన రోడ్ల విస్తరణ సైతం మంత్రి పట్టుబట్టి చేయించడంతో జిల్లా కేంద్రం రూపురేఖలు మారిపోయాయి. సెంటర్ లైటింగ్‌తోపాటు పచ్చదనం ఉట్టిపడేలా రోడ్లను తీర్చిదిద్దారు. నూతన వ్యవసాయ మార్కెట్ యార్డు, టౌన్‌హాల్, మదర్ అండ్ కేర్ సెంటర్, వే సైడ్ మార్కెట్, క్రిటికల్ కేర్ యూనిట్ తదితర అనేక పనులను మంజూరు చేయించి పూర్తి చేశారు.



వనపర్తి పట్టణ వ్యూ

### పట్టువదలని విక్రమార్కుడిలా..

వనపర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పట్టువదలని విక్రమార్కుడిలా పనిచేస్తున్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందినప్పటికీ నియోజకవర్గ సాగునీటి వనరులపై ప్రత్యేక దృష్టి సారించి సక్సెస్ అయ్యారు. నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ప్రజలకు అవసరమైన పనులను చేయించడంలో నిమగ్నమై పనిచేశారు. అదే స్ఫూర్తితో 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోనే భారీ మెజార్టీని సింగిరెడ్డికి ఓటర్లు ఇచ్చారు. ఇక మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అలుపు లేకుండా అభివృద్ధి పనులను చేపడుతున్నారు. తెలంగాణ ఉద్యమంలో నాడు సీఎం కేసీఆర్‌కు వెన్నుదన్నుగా ఉన్నారు.

### రేపు సీఎం కేసీఆర్ బహిరంగ సభ..

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ గురువారం వనపర్తి జిల్లా కేంద్రానికి వస్తున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు జరుగుతున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొని మరోసారి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని గెలిపించే దిశగా ఓటర్లకు దిశా నిర్దేశం చేయనున్నారు. వనపర్తి నియోజకవర్గంపై ప్రత్యేక అభిమానం ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకు మరికొన్ని అభివృద్ధి పనులను తీసుకెళ్లి హామీ పొందాలని మంత్రి సింగిరెడ్డి పనుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఇటీవల పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని సైతం ప్రారంభించి జాతికి అంకితం చేశారు. మరోసారి ఎన్నికల సభలో పాల్గొనేందుకు వస్తున్న ముఖ్యమంత్రికి నియోజకవర్గానికి వరాల జల్లు కురిపిస్తారని ఈ ప్రాంత ప్రజలు విశ్వాసంతో ఉన్నారు.



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్



వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



మెడికల్ కళాశాల


# అభివృద్ధికి తొలిమెట్టు అచ్చంపేట

- నల్లమలపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి
- ఎంజీకేఎల్ఐతో సాగునీరు
- అచ్చంపేట లిఫ్టుతో మహర్దశ
- రేపు సీఎం కేసీఆర్ సభ
- జిల్లాలో ఎన్నికల ప్రచారం షురూ..

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : అభివృద్ధిలో అచ్చంపేట దూసుకుపోతున్నది. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో ప్రభుత్వ విప్, గువ్వల బాలరాజు పదేండ్లలోనే 65ఏండ్ల అభివృద్ధిని ఊహించని విధంగా చేపట్టారు. ఎంజీకేఎల్ఐ లిఫ్టుతో ఉప్పునుంతల, అచ్చంపేట, బల్మూర్‌లో పలు గ్రామాలకు సాగునీళ్లు వస్తున్నాయి. ఇటీవలే ప్రభుత్వం రూ.2,500కోట్లను మంజూరు చేయడంతో అచ్చంపేట లిఫ్టు పనులకూ ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు శంకుస్థాపన చేశారు. ఈ లిఫ్టు పూర్తైతే నియోజకవర్గంలోని అడవిలో ఎత్తైన ప్రాంతంలో ఉన్న మద్దిమడుగు, పదర, అమ్రాబాద్‌లాంటి ప్రాంతాలకు సాగునీళ్లు లభించనున్నాయి. దీనివల్ల నియోజకవర్గంలో వర్షాధారం, బోర్లపై ఆధారపడే సాగు కాల్వలు, చెరువులు, కుంటల ద్వారా జరిగే పరిస్థితులు ఉన్నాయి. ఇక అచ్చంపేట మున్సిపాల్టీలో 150మందికి డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరవడంతో అచ్చంపేట పేదల్లో సంతోషం వ్యక్తమవుతోంది. అలాగే వంద పడకల దవాఖానను మంత్రి హరీశ్‌రావు ప్రారంభించడం విశేషం. దీనివల్ల నల్లమలలోని పేదలకు మెరుగైన వైద్యం లభిస్తోంది. అలాగే పోడుభూముల పంపిణీతో ఇక్కడి చెంచులు, గిరిజనులకు భూములపై హక్కు లభించింది. ఈగలపెంట, మన్ననూరులో ఎకో టూరిజంలో భాగంగా నిర్మించిన కాటేజీలు పర్యాటకానికి కొత్త అందాన్ని తీసుకొచ్చాయి. ముఖ్యంగా జంగిల్ సఫారీతో హైదరాబాద్ ప్రాంతాల ప్రజలు ఇక్కడికి వచ్చి నల్లమల అడవి, కృష్ణానది తీర ఒంపులను చూస్తూ ఆహ్లాదాన్ని పొందుతున్నారు. కాగా, జిల్లాగా మారడం ఇక్కడి ప్రజలకు ప్రధాన సమస్యను తీర్చింది. జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే గతంలో మహబూబ్‌నగర్ వెళ్లాల్సి వస్తుండె. దీంతో నాడు ఒకట్రెండు రోజులు పట్టే పని ఇప్పుడు నాగర్‌కర్నూల్‌కు వెళ్లి ఒక్క రోజులోనే పని పూర్తి చేసుకొంటున్నారు. ఇందులో భాగంగా పదర, చారకొండ కొత్త మండలాలుగా ఏర్పడగా రెవెన్యూ, పోలీసు సబ్ డివిజన్లు ఏర్పాటయ్యాయి. ఇలా పాలన మరింత చేరువకు వచ్చింది. అప్నా తండామే అప్నా రాజ్ అనేలా తండాలు పంచాయతీలుగా అప్‌గ్రేడ్ కాగా 75తండాల్లో గిరిజనులు పాలితులుగా మారారు. నల్లమలలోని మద్దిమడుగు, సలేశ్వరం, ఉమామహేశ్వరం, రంగాపూర్‌లాంటి ప్రాంతాలు ఆధ్యాత్మికంగా మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై నల్లమల ప్రజలకు విశ్వాసం పెరిగింది. ఫలితంగా గత రెండు సాధారణ ఎన్నికల్లోనూ గువ్వల బాలరాజును గెలిపించారు. కాగా, నవంబర్ 30న జరిగే ఎన్నికల్లోనూ మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించేలా ప్రజలు తీర్మానించుకుంటున్నారు. ఇందులో భాగంగా అభ్యర్థిగా ప్రకటించిన గువ్వలకు మద్దతుగా సీఎం కేసీఆర్ ఈనెల 26న అచ్చంపేటలో భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఈ సభతో అచ్చంపేటతో పాటుగా నాగర్‌కర్నూల్ జిల్లాలోనూ బీఆర్‌ఎస్‌లో జోష్ నింపనుంది. ఈ సభను విజయవంతం చేసేందుకు గువ్వల బాలరాజు ఏర్పాట్లు చేస్తున్నారు.



అచ్చంపేటలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇండ్లు



అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

### అచ్చంపేట అభివృద్ధి ఇలా..

- రూ.2,500కోట్లతో అచ్చంపేట లిఫ్ట్‌నకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో 72వేల ఎకరాల ఆయకట్టుకు అందనున్న సాగునీరు
- అచ్చంపేటలో 100 పడకల దవాఖాన ప్రారంభం
- రూ.4.50కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయం పనులు
- రూ.100కోట్లతో మన్ననూర్, ఈగలపెంటలో ఎకో టూరిజం
- ఉమామహేశ్వరం, మల్లెలతీర్థం ఆలయాల అభివృద్ధి, మన్ననూరు, ఈగలపెంటలో కాటేజీల నిర్మాణాలు
- రూ.3.50కోట్లతో ఇండోర్, ఎన్టీఆర్ స్టేడియాల్లో వసతుల కల్పనకు నిధుల మంజూరు
- డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.100కోట్లు మంజూరు
- గిరిజన పంచాయతీలకు నూతన భవనాలు
- ఆర్డీవో, పోలీస్ సబ్ డివిజన్ కొత్త కార్యాలయాల ఏర్పాటు
- కొత్తగా పదర మండలం ఏర్పాటు
- ఎంజీకేఎల్ ఐ ద్వారా సాగునీరు
- అచ్చంపేట, ఉప్పనుంతలలో 15వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.107కోట్లతో 15కిలో మీటర్ల బ్రాంచ్‌కెనాల్ పనులు

# కాంగ్రెస్‌కు ఓటేస్తే.. గడ్డు కాలమే..

- 'హస్తం' నేతలకు చేయందిస్తే కష్టాలు తెచ్చుకున్నట్లే..
- ఆరు హామీలు ఆరు నెలలు కూడా ఉండవు
- మా వద్ద మూడు గంటల కరెంట్ కూడా లేదు
- తెలంగాణలో రైతుల కోసం అమలవుతున్న పథకాలు భేష్
- గద్వాలలో ప్లకార్డులతో కర్ణాటక రైతుల ఆందోళన



కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ రోడ్డుపై బైఠాయించిన కర్ణాటక రైతులు

గద్వాల, అక్టోబర్ 24 : కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కష్టాలు తప్పవని.. నమ్మి మోసపోతే గోస పడుతామని కర్ణాటకలో ఓటేసి గెలిపించిన ప్రజలే నేడు ఆ పార్టీ తీరుపై ఛీకొడుతున్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఐదు హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. ఆర్టీసీలో మహిళలకు ఉచితం ప్రయాణ సౌకర్యం కల్పించగా, పుణ్యక్షేత్రాలకు వెళ్లి ఇప్పటి వరకు ఇంటికి తిరిగి రాలేదు. పొరపాటున తెలంగాణలో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రైతులతోపాటు ప్రజలు ఉరేసుకోవాల్సి వస్తుంది.. కాంగ్రెస్‌ను నమ్మి తెలంగాణ ప్రజలు ఓటు వేయవద్దని సూచిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ రాయిచూర్‌కు చెందిన రైతులు మంగళవారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ ఆవరణలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కర్ణాటక రైతు సంఘం అధ్యక్షుడు ధర్మారెడ్డి అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలో కాంగ్రెస్ ఐదు హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పటి వరకు ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ఉచిత ప్రయాణ సౌకర్యంతో మహిళలు పుణ్యక్షేత్రాలకు వెళ్లి ఇప్పటి వరకు ఇంటికి తిరిగి రాలేదన్నారు. గతంలో రైతులకు 12గంటల కరెంట్ ఇస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 3గంటల కరెంట్ కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉందన్నారు. దీంతో వరి పైరు ఎండిపోతుందని, ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రైతులకు రూ5వేలు ఇస్తామని చెప్పి ప్రకటించి ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. ఇచ్చిన హామీలు ఇవ్వలేక ప్రభుత్వం చతికిలపడిపోయిందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఆరు హామీల పేరుతో ప్రజలను మోసం చేయడానికి కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని, వారు చెప్పే ఆరు హామీలు ఆరు రోజులు కూడా అమలు కావన్నారు. కర్ణాటకలో పంటలు ఎండిపోయి రైతులు చనిపోతున్నా ఆ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో సీఎం రైతు సంక్షేమం కోసం పాటుపడుతున్నాడని చెప్పారు. రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడంతో ఇక్కడి రైతులు సిరులు పండిస్తున్నారని, దీంతోపాటు రైతు మరణిస్తే వారికి బీమా కింద రూ.5లక్షలు ఇస్తున్నారన్నారు. ఇలాంటి పథకాలు మాకు కావాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దని కోరుతూ తెలంగాణ మొత్తం ఈ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కర్ణాటకలో కరెంట్ కష్టాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటూ చీకట్లో మగ్గుతున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చే మోసపూరిత వాగ్దానాలు నమ్మి మోసపోవద్దని, మేము నమ్మి ప్రస్తుతం గోసపడుతున్నామని చెప్పారు. ఈ ఆందోళనలో రైతులు నగేశ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ పథకాలు అమలు చేయాలి..



రైతుల కోసం తెలంగాణలో అమలవుతున్న రైతుబీమా, రైతుబంధు, సాగుకోసం 24గంటల ఉచిత విద్యుత్ పథకాలు కర్ణాటకలో అమలు చేయాలి. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు ఆశపడి ఓటు వేసి ఇప్పుడు గోసపడుతున్నాం. తెలంగాణ ప్రజలు మోసపోకూడదనే ముందస్తుగా కాంగ్రెస్ మోసాలను తెలియజేయడానికి ఈ ఆందోళనలు చేపడుతున్నాం. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కష్టాలు తప్పవు.

-నరసింహారెడ్డి, గాజులపాడు, కర్ణాటక

### కర్ణాటకలో రైతులను పట్టించుకునే వారే లేరు..



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ కష్టాలు తీర్చడంతోపాటు రైతులకు మేలు చేకూర్చే పథకాలు అమలు చేస్తామని చెప్పారు. వారి మాటలు నమ్మి గెలిపించాం. అధికారంలోకి వచ్చాక చెప్పిన ఏ ఒక్క హామీ పట్టించుకోవడం లేదు. కరెంటు లేక పంటలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యమని చెప్పి అదీ సరిగా అమలు కావడం లేదు. మాలాగా తెలంగాణ రైతులు మోసపోకుండా ఉండాలనే ఈ ఆందోళనలు చేస్తున్నాం. కాంగ్రెస్ మాటలు నమ్మితే రైతులు ఉరేసుకోవాల్సి వస్తుంది.

- నగేశ్, రైతు, బూడిదపాడు, కర్ణాటక